## క్లుప్తంగా

### నేడు మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి పర్యటన

**బంటుమిల్లి:** మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం జరిగే పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ తెలిపారు. కంచడం గ్రామంలో గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నిర్మించిన రోడ్లు, సామాజిక భవనం, ఆముదాలపల్లి గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

### గోవాడ చంటి మృతికి ఎమ్మెల్యే సింహాద్రి సంతాపం



**చల్లపల్లి:** గ్రామ ప్రముఖుడు గోవాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి) మంగళవారం ఉదయం తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. చంటి పంచాయతీ బోర్డు సభ్యునిగా, పలు దేవాలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. చంటి సతీమణి గోవాడ పావని ఎంపీటీసీ సభ్యురాలిగా సేవలు అందించారు. చంటి మృతదేహాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, నాయకులు వెనిగళ్ల జగదీష్, అల్లంశెట్టి చలం పాల్గొన్నారు.

### ఈవీఎంలపై అవగాహన



**చల్లపల్లి:** ఈవీఎంల వినియోగంపై ఓటర్లు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ వినియోగంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లో వేసిన ఓటును వీవీ ప్యాట్ ద్వారా నిర్ధారించుకోవచ్చని చెప్పారు. ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాలను గ్రామ గ్రామాన నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, ఘంటసాల కృష్ణమోహన్, సత్యనారాయణ, వీఆర్వోలు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, నాగమల్లేశ్వరరావు, కిరణ్, ఏఎస్ఓ అఖిలా పర్వీన్ పాల్గొన్నారు.

### ఎంఎస్‌పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నవీన్

**చల్లపల్లి:** ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగం ఎంఎస్‌పీ కృష్ణా జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నవీన్ నియమితులయ్యారు. మంగళవారం కోస్తాంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నవీన్‌ను పలువురు అభినందించారు.

### కులగణనపై అవగాహన

**మోపిదేవి:** సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శి, వలంటీర్ ఇంటింటా తిరిగి కులగణన సర్వే చేపట్టారని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1929 తరువాత కులగణనను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అధికారులు అడిగే కులం, ఉపకులాల వివరాలు తెలియచేయాలని కోరారు. డిజిటల్ అసిస్టెంట్, ట్రైనర్ పవన్ కల్యాణ్, ఎంపీపీ రావి దుర్గావాణి, పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### పాస్టర్లకు వస్త్రాలు అందజేత



**ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండలం ఘోటకం కాలనీలోని బేతేలు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ చిన్నం దానియేల్, శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్‌నాయుడు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం శ్యాం కిశోర్‌నాయుడు 20 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సతీష్‌పాల్, విజయ భాస్కర్, సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు

**ఎమ్మెల్యే పేర్ని నాని**

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం నియోజకవర్గంలో మిచాంగ్ తుపాను సందర్భంగా విద్యుత్ సిబ్బంది అంకితభావంతో అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నియోజకవర్గంలోని విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది, కార్మికుల ఆత్మీయ సమావేశం మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు ఆత్మీయ విందును ఎమ్మెల్యే పేర్ని నాని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావంతో గాలులు, భారీ వర్షం కురుస్తున్నా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా నిరంతరం పర్యవేక్షించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. గాలులకు కూలిన స్తంభాలు, తెగిన విద్యుత్ తీగలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూశారన్నారు. విద్యుత్ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు ప్రత్యేక చొరవతో సిబ్బందిని అప్రమత్తం చేసి సేవలు అందించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జె. పద్మ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బందిని ఎక్కువగా ప్రజలు, రాజకీయ నాయకులు దూషిస్తూనే ఉంటారన్నారు. కాని దీనికి విరుద్ధంగా మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని విద్యుత్ అధికారులు, ఉద్యోగులను, కార్మికులను అభినందిస్తూ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల్లో గతాని కంటే ఇప్పటికి పని పట్ల ఆసక్తి పెరిగిందని చెప్పారు. సమిష్టి కృషితో రానున్న రోజుల్లో సేవాభావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందగలమన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న మనం ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలని చెప్పారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ టెక్నికల్ డైరెక్టర్ జయభారతరావు, ఎలక్ట్రికల్ ఎస్ఈ మురళీమోహన్, ప్రాజెక్ట్స్ జీఎం సాంబశివరావు మాట్లాడారు. కార్యక్రమంలో మచిలీపట్నం నియోజకవర్గంలోని ఏడీఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, హెల్పర్లు, సబ్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

**ఇంధన పొదుపు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..**

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జె. పద్మ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్‌హాల్‌లో పేర్ని నాని నిర్వహించిన మచిలీపట్నం విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది, కార్మికుల ఆత్మీయ సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ పద్మ జనార్దనరెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక ఏసీ పనిచేస్తే 30 ఫ్యాన్లు తిరిగినంత విద్యుత్ వాడకం జరుగుతుందన్నారు. ఏసీ సెట్టింగ్ ఒక డిగ్రీ పెంచితే దాదాపు 6 శాతం విద్యుత్ ఆదా అవుతుందని చెప్పారు. ఇంటింట కరెంటు పొదుపు, ఊరూరా వెలుగు నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ టెక్నికల్ డైరెక్టర్ జయభారతరావు, ఎలక్ట్రికల్ ఎస్ఈ మురళీమోహన్, ప్రాజెక్ట్స్ జీఎం సాంబశివరావు, మచిలీపట్నం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు పాల్గొన్నారు.

## జగనన్నే కావాలి.. జగనన్నే రావాలి

**పేర్ని కిట్టు**

**కోనేరుసెంటర్:** ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి కావాలని, ఆయనే రావాలని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని తపసిపూడి, మంగినపూడి గ్రామాల్లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను, సంక్షేమ పథకాల బోర్డులను పేర్ని కిట్టు ఆవిష్కరించారు. కిట్టు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్నివర్గాలకు అండగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి అని చెప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. అనంతరం తపసిపూడి బీచ్ వద్ద జరుగుతున్న బందరుపోర్టు నిర్మాణ పనులను మండల నాయకులతో కలిసి కిట్టు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, తపసిపూడి సర్పంచ్ చందన మస్తాన్, పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, నాగేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ జువ్వా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**బడుగుల జీవితాల్లో వెలుగులు..**

**మచిలీపట్నంటౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల జీవితాల్లో వెలుగులు చోటు చేసుకున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు.



మాట్లాడుతున్న పేర్ని కిట్టు



15వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన పేర్ని కిట్టు, నాయకులు

15వ డివిజన్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరిగిందని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్ మొహమ్మద్ షహనాజ్ బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మొహమ్మద్ రఫీ, పార్టీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే వెంకటస్వామికి నివాళి



చీరలు పంపిణీ చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ. చిత్రంలో డెప్యూటీ మేయర్ విజయలక్ష్మి

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం మాజీ ఎమ్మెల్యే బొర్రా వెంకటస్వామి ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బస్టాండ్ సెంటరులోని వెంకటస్వామి విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేర్ని నాని మాట్లాడుతూ వెంకటస్వామి నిస్వార్థ ప్రజాసేవకుడిగా పేరుపొందారన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యత స్వీకరించిన ఏడాది కాలంలోనే ఆయన మృతి చెందటం విచారకరమన్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్లు షేక్ సలార్‌దాదా, ఎంవీ బాబాప్రసాద్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు కేవీవీ సత్యనారాయణ, ఎస్. సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వడ్డి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి తనయుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చీరలను పేద మహిళలకు మేయర్ అందజేశారు.

### ప్రథమ శ్రేణి గ్రంథాలయం సందర్శన



పాఠకులతో మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ

**అవనిగడ్డ:** స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమల పూర్ణమ్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు, విద్యార్థులతో ఆమె మాట్లాడి గ్రంథాలయ సేవలు, పాఠకుల అవసరాలను గురించి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ని పరిశీలించారు. గ్రంథాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్ పాల్గొన్నారు.

## ఒక శాతం సెస్‌ను జమ చేయాలి

**డీఆర్వో పెద్ది రోజా**

**మచిలీపట్నంటౌన్:** ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో జరిగే నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల్లో ఒక శాతం సెస్‌ను ప్రతి నెలా నిర్మాణ మండలికి అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996 పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సెస్ వసూలుపై సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ పలు నిర్మాణ పనులు చేపట్టే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం కింద ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ భవన, ఇతర నిర్మాణాల మీద వచ్చే ఆదాయంలో ఒక శాతం సెస్‌ను మండలికి జమ చేయాలన్నారు. ఒక శాతం సెస్ వసూళ్లపై మండలికి కార్మిక శాఖ ప్రతి నెలా నివేదికను, యాన్యువల్ రిటర్న్స్‌ను పంపాలని చెప్పారు. ఒక శాతం సెస్ మండలికి సక్రమంగా జమ చేస్తున్నారా, లేదా, నివేదికలు పంపుతున్నారా అనే విషయాలపై ఆమె ఆరా తీశారు. సమావేశంలో ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి, సహాయ కార్మిక కమిషనర్ ఎస్. గోవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ గరుడప్రసాద్

**కృత్తివెన్ను:** మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వేరుశనగ పంటను తిరిగి వేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తోందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మంగళవారం నిడమర్రు పంచాయతీ పరిధిలోని పోడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు 80 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందించారు. మండల వ్యాప్తంగా 450 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతిందని, సుమారు 25 టన్నుల విత్తనాలు రైతులకు అందజేయనున్నట్లు ఏఓ ఎస్. జెన్నీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మైల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైధాని వెంకట్రాజు, వీఏఏ నరసింహ నాయక్, రైతులు పాల్గొన్నారు.

● **బంటుమిల్లి:** వేరుశనగ, మినుము విత్తనాలను 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తోందని వ్యవసాయ శాఖాధికారి (ఏఓ) శివరామకృష్ణ తెలిపారు. రైతుల కోసం కే 6 రకం విత్తనం దాదాపు 100 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. దాదాపు 200 క్వింటాళ్ల మినుము విత్తనాలు వీబీఎన్ 8 రకం 80 శాతం రాయితీపై సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కిలో రూ. 110లకు గాను 80 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు ఆర్బీకేల వద్ద ప్రజాప్రతినిధులు విత్తనాలను రైతులకు అందజేశారు.

### గోదాదేవికి దీపాల సేవ

**కోడూరు:** ధనుర్మాసాన్ని పురస్కరించుకుని కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి దీపాల సేవ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పండితులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పల్లకీలో ఉత్సవమూర్తిని ఆలయం చుట్టూ ఊరేగించి, మహిళలు దీపాల సేవ నిర్వహించారు. వివిధ రకాల హారతులతో భక్తిభావం చాటారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 'జగనన్నకు చెబుదాం' వాయిదా

**గూడూరు:** గూడూరులో బుధవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దయిందని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు.

### ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

**గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్**



గూడూరులోని మురళీకృష్ణ రైస్‌మిల్లులో రిజిస్టర్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయప్రసాద్

**గూడూరు:** గూడూరు మండలంలోని పలు రైస్ మిల్లులను తహసీల్దార్ బి.విజయప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. గూడూరులోని మురళీకృష్ణ, తరకటూరులోని నవీన, తిరుమల రైస్ మిల్లుల్లో రిజిస్టర్లను తనిఖీ చేసిన తహసీల్దార్ స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని మిల్లర్లకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు కరీముల్లా, కోటేశ్వరరావు, కాకుశేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభం

**కోడూరు:** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కోడూరు మండల విద్యా శాఖ విద్యార్థులకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాలోత్సవ ప్రారంభ సభ ఎంఈఓ టీవీఎం రామదాసు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. బాలోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ కోడూరు విద్యా శాఖ అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు పూర్తి విశ్వాసం కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు విజ్ఞానం, మానసిక ఉల్లాసం, క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా పలు ఆటల పోటీలను పది రోజుల పాటు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించడం హర్షణీయమని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఇంగ్లిష్ మీడియం, అమ్మఒడి, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో విద్యార్థుల భవిష్యత్‌కు పూర్తి భరోసా కల్పిస్తున్నామని వివరించారు.

**తొలి రోజు పోటీలు..**

తొలి రోజు విద్యార్థులకు కబడ్డీ, త్రోబాల్, స్కిప్పింగ్, ఖోఖో పోటీలను జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీమ్‌లను ఎంపిక చేసి, మరోసారి ఫైనల్ పోటీలను నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆంథ్రాలజీ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసులు, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంఈఓ–2 విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, హెచ్ఎం ఏవీ రమణ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

## దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా పథకాలు

**జోగి రాజీవ్**



ఏడో వార్డులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న రాజీవ్, నాగకుమారి తదితరులు

**పెడన:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేరుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారితో కలిసి 7, 8, 10, 11 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా అదనంగా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. ఎటువంటి దళారులు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నగదు రూపంలో నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయని వివరించారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బి. జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, పార్టీ నాయకులు నాగకుమార్, కోడూరు శ్రీనివాసరావు, మహేష్, ముత్యాల మురళి కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతాలు కలిగి ఉండాలి



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న వీరయ్య

**గూడూరు:** ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు కలిగి ఉండాలని కేడీసీసీ బ్యాంకు గూడూరు మేనేజర్ ఫణికృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో గూడూరు మండలం నారికేడాలపాలెం, కలపటం గ్రామాల్లో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణ మాట్లాడుతూ ఏదైనా జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు కలిగి ఉండటం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధి పొందవచ్చన్నారు. పీఎంజేజేవై, పీఎం సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డుల వంటి నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి అవకాశం లభిస్తుందన్నారు. వై.వీరయ్య ఆధ్వర్యంలోని రవితేజ కళాజాతా సభ్యులు కళాజాత ప్రదర్శన ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలను చైతన్య పరిచారు.

## విద్యార్థులు కమ్రశిక్షణతో చదవాలి

**డీవైఈఓ సుబ్బారావు**



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీవైఈఓ సుబ్బారావు

**మచిలీపట్నంటౌన్:** విద్యార్థులు భయం వీడి ఉన్నత లక్ష్యాలతో చదువులో ముందుకు వెళ్లాలని బందరు డీవైఈఓ యూవీ సుబ్బారావు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జవ్వారుపేటలోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు క్రమశిక్షణ, అంకితభావంతో కృషి చేయాలన్నారు. వక్త కాగిత శంకర సాంబశివరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు విజయం సాధించే స్టడీ టిప్స్, మెమరీ టిప్స్‌ను వివరించారు. యోగా, ధ్యానం ద్వారా ఏకాగ్రత సాధించవచ్చునని చెప్పారు. పరీక్షల సమయంలో సమయపాలన, ఆహార అలవాట్లు ఎలా ఉండాలో వివరించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సాయికృష్ణప్రసాద్, సంస్థ ప్రతినిధులు రంగారావు, శాస్త్రి, రాజేంద్రప్రసాద్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

### పెడనకు పూజా అక్షింతలు

**పెడన:** అయోధ్య రామమందిరం నుంచి మంగళవారం వచ్చిన పూజా అక్షింతలను పెడన గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో అన్ని గ్రామాలలో వితరణ చేయడానికి సిద్ధం చేశామని హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి వీటిని పెడన మండలంలోని అన్ని గ్రామాలకు, పట్టణంలోని అన్ని వార్డులలోని వారికి అందజేస్తామన్నారు. హిందూ బంధువుల ఐక్యవేదిక ద్వారా విశ్వ హిందూ పరిషత్, ఆర్‌ఎస్ఎస్ వారు వీటిని అందజేస్తారని చెప్పారు.

### నేడు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

**పెదప్రోలు(మోపిదేవి):** ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం పెదప్రోలు గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ శ్రీరామ్ సాయి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులను స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు లబ్ధిదారులకు అందజేస్తారని చెప్పారు.

### చిన్నారులకు ఫిజియోథెరఫీ

**పెడన:** భవిత కేంద్రాల్లో ఫిజియో థెరపిస్ట్ ఏ విధంగా చిన్నారులకు ఫిజియో థెరపీ చేస్తున్నారో అదేవిధంగా ఇళ్ల వద్ద తల్లిదండ్రులు చిన్నారులకు చేయించాలని ఎంఈఓ–2 వైవీ హరనాథ్ సూచించారు. మంగళవారం బంగ్లా స్కూల్‌లోని భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియో థెరపీ శిబిరం నిర్వహించారు. ఫిజియో థెరఫిస్టు హుస్సేన్, హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఎండీ బాబు తదితరులు పాల్గొన్నారు.